
# నాకీశిక్షచాలదు...

"ఏవండోయ్ విన్నారా ఇది..." భర్తకు కాఫీ పట్టుకొస్తూ గద్గద స్వరంతో పలికింది వరలక్ష్మి.

భార్య చేయిపట్టుకుని మెల్లగా లేచి కూర్చున్నాడు గోవిందయ్య.

"పాపం అలివేణికి అన్యాయంజరిగిపోయింది." భర్త నోటికి కాఫీ అందిస్తూ బోలెడంత సానుభూతి కురిపించింది వరలక్ష్మి.

ఆమె ఎవర్నిగురించి చెబుతోందో అర్థం గాక అయోమయంగా చూసాడు గోవిందయ్య.



" ఏమిటండి అలా చూస్తున్నారు. పేర్రాజు గారమ్మాయి అలివేణిని గురించి చెబుతున్నాను."

" సంబంధాలు కుదిర్చే పేర్రాజేనా ?"

ఔనన్నట్లుగా తల వూపింది వరలక్ష్మి.

" వాడి కూతురికేమై ందే. యాభై వేలుపోసి ఆకాశం నుండి సంబంధం దింపుకొస్తే కాబోయే అల్లుడు బంగారుపిచ్చుకన్నారు."

" ఆ పిచ్చుకే గాలిలో ఎగిరిపోయిందని అందరూ అనుకుంటున్నారు."

"అపశకునపక్షిలాఅ వేంమాటలు ముహూర్తం పెట్టుకొని వాళ్లు హాయిగా పెళ్లి ఏర్పాట్లు చేసుకొంటూవుంటే" అన్నాడు గోవిందయ్య.

"మీలాగే నేను మొదట నమ్మలేదు పక్కింటి పద్మావతి చెవిని ఇల్లుకట్టుకొని మరీ చెప్పింది. అబ్బాయి హైదరాబాదులో ఏదో పెద్ద కంపెనీలో ఉద్యోగం వెలగబెడుతున్నాడని మధ్యవర్తులు చెబితే ఆశపడి పూర్వాపరాలు తెలుసుకోకుండా క్షణాల్లో సంబంధం కుదుర్చుకున్నాడు. అనుకున్న కట్నం డబ్బు ముందుగా ఇవ్వాలని పట్టుబడితే కాదనలేకపోయాడు. సొమ్ము చేతిలో పడటంతోనే రాత్రికి రాత్రి పెళ్లికొడుకు వుడాయించాడట." విషయమంతా వివరించింది వరలక్ష్మి.

" మరి పేర్రాజు ఊరుకున్నా డెందుకు? మధ్యవర్తులను నిలదీసి అడగలేదా ?"

" అదీ అయింది. "మాకు మాత్రమేం తెలుసు అతడి ప్రవర్తనచూసి మంచివాడ

మూరి వెంకటరావు

నుకున్నాం" అని చల్లగా తప్పుకున్నారట. పేర్రాజు అందరికీ శుభలేఖలు కూడా పంచే శాడు. బంధుజనం ఒక్కొక్కరు దిగే సమయంలో ఈ ఘోరం జరిగింది.

" పెళ్లికొడుకు పారిపోయాడని ఎందుకనుకోవడం ఎక్కడకు వెళ్లాడో ! ముహూర్తం వేళకు రావచ్చుకదా !"

అమాయకంగా వున్నాయి గోవిందయ్య మాటలు.

"ఆ అనుమానం మీకేం అక్కర్లేదు. పేర్రాజు తోడల్లుణ్ణి హైద్రాబాద్ పంపి వాకబు చేయించాడట అతడు చెప్పిన కంపెనీయే అక్కడ లేదని నిర్ధారణ చేసుకొని మరీ వచ్చాడాయన. వాడెవడో వట్టి దొంగవెధవ. మన పేర్రాజును వచ్చిగా మోసం చేశాడు. పాపం అలివేణిని తలచుకుంటూఉంటే జాలి వేస్తుంది" చెమ్మగిల్లిన కళ్లను పమిటచెంగుతో వత్తుకుంది వరలక్ష్మి.

భార్య ఎంత బాధపడుతున్నా గోవిందయ్యకు మాత్రం పేర్రాజు మీద సానుభూతి కలగడంలేదు. వున్నట్లుండి అతడి దృష్టి గతంలోకి మళ్లింది.

* * * *

న్యాయాన్ని, ధర్మాన్ని నమ్మే సగటు మనిషి గోవిందయ్య.

సమితాఫీసులో గుమస్తాగిరి అతడి వృత్తి
నిజాయితీ అతడి ఊపిరి.

కలిమి కరువైనా అతడి గుండెల్లో కరుణకు మాత్రం కరువులేదు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అతడి నైజం. మంచి వాళ్లకే అన్నికష్టాలు వస్తాయి అంటారు. బహుశా భగవంతుడు అటువంటి వారిని పరీక్షించి తనలో ఐక్యం చేసుకోవటానికి కాబోలు పని గట్టుకొని ఇక్కట్లు సృష్టిస్తాడు. ఇన్ని సుగుణాలు వున్న గోవిందయ్యకి నాలు గేళ్ల క్రితం ఉన్నట్టుండి కుడికాలు, కుడిచేయి పక్షవాతం వచ్చి పడిపోయాయి. పరాధీనమైపోయింది అతడి శరీరం. ఎడమ చంకలో కర్ర ఉంచుకుని దేకుతూ శేష జీవితమంతా గడపమని ఆదేశించాడా దేవుడు. ఉద్యోగానికి అనర్హుడవడంతో సర్వీసు ఉండగానే ప్రభుత్వం అతడిచేత బలవంతంగా పదవీ విరమణ చేయించింది. చాలీచాలని పింఛను డబ్బులతో భారంగా రోజులు నెట్టుకొస్తున్న గోవిందయ్యను వేధించే సమస్యలు రెండే రెండు. ఇంటరు చదివి ఇంట్లో కూర్చున్న కమలకు పెళ్లి చేయాలి. విశాఖలో కంప్యూటర్ ట్రెయినింగ్ అవుతున్న రవికి ఉద్యోగ మవాలి. కొడుకు తన చేతికందడానికి కొంతకాలం పడుతుంది. అంతవరకు కమలకి పెళ్లి చెయ్యకుంటే ఈడు మించిపోయే ప్రమాదముంది. అందుకని ప్రావిడెంట్ ఫండు రూపంలో వచ్చిన అతి స్వల్ప



క్రికెటర్ రవిశాస్త్రి వివాహానికి హాజరై వధూవరులకు శుభాకాంక్ష లందజేస్తున్న మరో క్రికెటర్ సందీప్‌పాటిల్

మొత్తాన్ని కూతురు పెళ్లికోసం కేటాయించి వుంచాడు. చదువు, రూపం, గుణం లాంటి పెళ్లికి కావలసిన అర్హతలన్నీ కమలలో మూర్తీభవించి వున్నాయి. తనేమాత్రం లేచి తిరగగలిగినా ఆ పిల్లకు పెళ్లికావడ మేమంత కష్టం కాదు.

గోవిందయ్య అవిటతనాన్ని సొమ్ము చేసుకోవాలనుకున్నాడు పేర్రాజు. కోలముఖం, చప్పిడి ముక్కు, బద్దపెదాలు పొడుగాటి గిరజాల జుట్టు, నుదుట పదిపైసలంత కుంకం బొట్టు, చేనేత చిలకట్టు సంచె పొడవైన లాల్చీ ఒకసారి చూడగానే ఎవరికైనా గుర్తుండిపోయే రూపం పేర్రాజుది. ఆ ఊళ్లో అందరూ అతడిని పెళ్లిళ్ల పేర్రాజంటారు. తన కొంప నిలబడాలంటే ఎదుటివారి కొంప కూలదోయాలన్న మనస్తత్వం అతడిది. ఆడపిల్లకు సంబంధాలు చూడటం అందుకుగాను కమీషన్లు వసూలు చేయడం అతడి వృత్తి.

"అన్నయ్యగారూ ! విశాఖపట్నం సంబంధం ఏమైందో చెప్పారే కాదు " అన్నది వరలక్ష్మి ఇంటికి వచ్చిన పేర్రాజుకు మజ్జిగ ఇస్తూ.

"ఆ సంగతి చెప్పడానికే వచ్చానమ్మా. అంగట్లో అన్నీవున్నా అల్లుడి నోట్లో శని వున్నట్లు అబ్బాయికి అందం, అంతస్తు ఎన్ని వున్నా బుగ్గమీద రవంత బొల్లి అతడిని వెక్కిరిస్తోంది. స్త్రీ సంపర్కముంటే అది శరీరమంతా వ్యాపిస్తుందంటారు. ముందే ఆ విషయం తెలిసుంటే అక్కడకు వెళ్లకపోదును" అంటూ ఎత్తిన గ్లాసు దించకుండా గటగటా మజ్జిగంతా త్రాగేసి త్రేవుమని త్రేన్చాడు పేర్రాజు.

"పోనీ ఆ సంబంధం కాకపోతే మరొకటి చూసిపెట్టండి. మా ఇంటి పరిస్థితులు మీకు తెలుసుకదా. ఆయనేమో మంచం మీద నుండి లేవలేరాయె. నేను చూస్తే ఆడదాన్ని. కమలకు పెళ్లెలా అవుతుందా అని బెంగపట్టుకుంది."

"బాధపడకు లక్ష్మి, నీ కూతురికి బ్రహ్మాండమైన ఒకటవరకం సంబంధం తెచ్చే పూచీనాది. సరేనా, రాజమండ్రిలో ఏదో సంబంధం వుందని ఇప్పుడే భోగట్టా అందింది. అబ్బాయి స్ఫురద్రూపి అని, స్టేట్ బ్యాంకులో ఆఫీసరని తెలిసింది. మన కమలకి ఈడు జోడు చూడముచ్చటగా ఉంటుందనుకో. పిల్ల నచ్చితే కట్నం ప్రసక్తే వుండదంటున్నారు వాళ్లు. అదే జరిగితే నీ పంట పండినట్లే."

"చాలా సంతోషం. వెంటనే వెళ్లి పెళ్లి చూపులకు ఏర్పాటు చేయించండి." తొందర పెట్టింది వరలక్ష్మి.

"నువ్వంతగా చెప్పాలా. ఇలా వెళ్లి అలా పెళ్లికొడుకు రెక్కపుచ్చుకుని లాక్కురాను... ఖర్చులకు...అహ...వెళ్లొచ్చేకా నువ్వు ఇవ్వవని కాదు. ప్రస్తుతం... " అతడి మాట పూర్తి కాకుండానే కొంగున కట్టి వుంచిన వంద రూపాయల కాగితం తీసి పేర్రాజు కిచ్చింది అతడి ఆంతర్యాన్ని అవగాహన చేసుకున్న వరలక్ష్మి.

"మరి సెలవ్. రేపొచ్చి కాయో పండో తేల్చి చెబుతాను" లేచి నిలబడ్డాడు పేర్రాజు.

"మీరు వెట్టుకొచ్చే పండు కోసమే ఎదు

రుచూస్తూ వుంటానని మరచిపోకండి."

"ఎంతమాట ? నువ్వంతగా చెప్పాలిటమ్మా! ఎప్పుడు నా చేతుల మీదుగా కమల కళ్యాణం జరుగుతుందా అని నీ కంటె ఉవ్విళ్లూరుతున్న వాడిని నేను" నడలిన పంచెకట్టు సవరించుకుంటూ వెళ్లిపోయాడు పేర్రాజు.

"పేర్రాజు వాలకం చూస్తూ వుంటే నాకు అనుమానంగా ఉంది. ఇంతవరకు సంబంధాలు చూడటం కోసం ఆయనకు రెండు వేల రూపాయల వరకు ముట్టజెప్పి వుంటావు. ఇల్లు గుల్లవుతోందేగాని సంబంధమేదీ స్థిరపడటంలేదు." అన్నాడు గోవిందయ్య ఎంతో ఆవేదనతో.

"అనవసరమైన అనుమానాలు పెట్టుకుని బుర్రపాడు చేసుకోకండి. మీరెలాను వీధిలోకి వెళ్లలేరు. నేను చూస్తే ఆడదాన్ని. మనకు దిక్కెవరున్నారు చెప్పండి. సంబంధాల కోసం ఆ మాత్రం ఖర్చుపెట్టకపోతే ఎవరు మాత్రం చూస్తారు?" పేర్రాజును సమర్థిస్తూ అన్నది వరలక్ష్మి. ఆమెకు ఇంకా అతడి మీద నమ్మకం పోలేదు.

అన్న మాట ప్రకారం మరునాడే వచ్చాడు ప్రేరాజు.

సాదరంగా లోపలకు ఆహ్వానించింది వరలక్ష్మి. అతడు చెప్పబోయే శుభవార్త కోసం చెవులు రిక్కించి వినడానికి సిద్ధంగా వుందామె.

"నేను సేకరించిన భోగట్టాలో వీసం పొల్లు పోలేదంటే నమ్ము. ఐతే పెళ్లికొడుక్కి మెల్లకన్ను, దొడ్డికాళ్లు వున్నాయన్న సంగతి చూస్తేగాని తెలియలేదు. ఎందుకో బంగారం లాంటి కమలకా సంబంధం చేయడానికి నా మనస్సు మాత్రం అంగీకరించడం లేదు. ఇలా అన్నానని నువ్వేమీ దిగులుపడకు. రేపీపాటికి దివ్యమైన సంబంధం పట్టుకొచ్చి నీ కాళ్లదగ్గర పడేస్తాను. ఓ రెండొందలుంటే ఇటు పారేయ్. విజయవాడ వెళ్లాలి."

## నాకీశిక్ష చాలదు...

అన్నాడు పేర్రాజు ఆమె చీరకొంగువంక ఆశగా చూస్తూ.

పేర్రాజు గోవిందయ్యనేకాదు ఇలా ఎందరో ఆడపిల్లల తండ్రులకు ఆశలు కల్పించి మాటలగారడితో డబ్బులు గుంజడం అలవాటు చేసుకున్నాడు. జనంలో నమ్మకం కలగడానికి ఒకటి, రెండు సంబంధాలు కుదిర్చిన సందర్భాలు లేకపోలేదు. ఈ రకంగా పేర్రాజు లక్షాధికారి కాలేకపోయినా, వేలాధికారి మాత్రం అవగలిగాడు.

* * * *

"అంతా కర్మఫలం. మనం చేసుకున్న పాప పుణ్యాలలో కొంత భాగం ఈ జన్మలోనే అనుభవించవలసి వుంటుంది. నేను ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో ఈ జన్మలో కుంటివాడినై మిమ్మల్ని అందరినీ క్షోభ పెడుతున్నాను."

"శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిభిః పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం" అని భాగవతంలో చెప్పబడింది. ఒకరిని బాగుచేస్తే మనకు మేలు కలుగుతుంది. ఒకరికి అపకారం తలపెడితే మనం చెడిపోవడం తథ్యం." అన్నాడు గోవిందయ్య శూన్యంలోకి విరక్తిగా చూస్తూ.

"వేదాంతం చెప్పి నన్ను మరి మాట్లాడనీయకుండా మంత్రంతో పామును కట్టిపడేసినట్లు పడేస్తారు."

వరలక్ష్మి మాటలకు చిరునవ్వు నవ్వుతూ "సమాజానికి ఏ కొంత మేలు జరగాలంటే ప్రతి వ్యక్తిలో ఎంతో కొంత మోతాదులో వేదాంత ధోరణి అనివార్యం. అది పూర్తిగా మృగ్యమైన నాడు మరింతగా రాక్షస ప్రవృత్తి ప్రబలిపోయి న్యాయానికి, ధర్మానికి ఈ లోకంలో ఇసుమంతైనా తావు లేకుండా పోతుంది." అన్నాడు గోవిందయ్య ఎంతో ఆవేదనగా.

"ఇలా మీతో మాట్లాడుతూ కూర్చుంటే అవతల పాలు పొంగిపోతాయి" లేచి నిలబడింది వరలక్ష్మి వంట ఇంటిలోకి వెళ్లేప్రయత్నంలో

"గోవిందయ్యా!"రొప్పుతు పరుగు పరుగున లోపలకొచ్చాడు పేర్రాజు.

అతడి ఆకస్మిక ఆగమనానికి ఆశ్చర్యపోయాడు గోవిందయ్య.

"నన్ను క్షమించు గోవిందయ్యా. నీకు తీరని ద్రోహంచేసాను. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న మిమ్మల్ని జలగలా పీడించి డబ్బులు గుంజుకెళ్లాను" అంటూ గోవిందయ్య కాళ్లు పట్టుకున్నాడు పేర్రాజు.

"అవేంమాటలు పేర్రాజు నీకు ఖర్చుల కోసం ఐచ్ఛికంగా మేమే ఇచ్చాం. ఇందులో నీ తప్పేమీలేదు."

"లేదు గోవిందయ్యా మిమ్మల్ని మభ్యపెట్టి ఎక్కడికీ వెళ్లకుండానే డబ్బులు తీసుకున్నాను. ఏవో కుంటిసాకులు చెప్పి మిమ్మల్ని నమ్మించాను. నేను చేసిన పాపానికి నా బిడ్డ బలైపోయింది. ఆడపిల్లల తండ్రులను మోసగించి నా కూతురికి పెళ్లి చేయాలనుకున్నాను. అందుకు తగిన శాస్తి జరిగింది. నాకీశిక్ష చాలదు..."

"వూరుకోండి అన్నయ్యగారు మీరు మరీ అలా దిగాలుపడిపోతే ఎలా ?" వారి సంభాషణలలో కలుగజేసుకుంటూ అన్నది వరలక్ష్మి.

"అలివేణికి పెళ్లని వూరంతా చాటించాను, ఆడంబరంగా శుభలేఖలు వేయించాను- బంధువులంతా వస్తున్నారు. వాళ్లకు నేనేం సమాధానం చెప్పేది ? పెళ్లికొడుకు పారిపోయాడని చెప్పనా ? ఆడకూతుళ్ళందరి ఉసురు నాకు తగిలిందని చెప్పనా ? పీటల వరకు వచ్చి తప్పిపోయిన నా కూతురికి ఇహ పెళ్లి అవుతుందంటావా ?" చిన్నపిల్లవాడిలా బోరున ఏడుస్తూ అన్నాడు పేర్రాజు.

"ఒక ఆడపిల్ల తండ్రిగా నీ ఆవేదనను అర్థం చేసుకోగలను. నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మరొకటుండదని గీతలో చెప్పబడింది. నీ బిడ్డకు పెళ్లి కాదేమోనని బెంగపడకు. నీకు అభ్యంతరం లేకపోతే అలివేణి నా కోడలవుతుంది" అన్నాడు గోవిందయ్య అతడిని ఊరడిస్తూ.

గోవిందయ్య మాటలు విన్న పేర్రాజుకు గొంతుక పూడుకపోయింది. ఎంత ప్రయత్నించినా నోరు విడడంలేదు. నాకంత అదృష్టమా అన్నట్లుగా ఉన్నాయి అతడి నయనాలు. నీ మంచితనాన్ని ఇకనేను భరించలేనన్నట్లు వున్నాయి అతడి చూపులు.

గోవిందయ్య విశాలహృదయానికి మౌనంగా మనసులోనే జోహార్లర్పించాడు పేర్రాజు. ●


త్వరలో

టానా "ఆంధ్రసచిత్రవారపత్రిక" సంయుక్త పోటీలో

బహుమతి రు. 5000/- పొందిన నవల.

కెరటాలు-కేరింతలు

మలుపుల మెరుపులతో ఉరుకులు తీసే సీరియల్!